# దేవుడమ్మా దేవుడు

చెప్పేవాడికి వినేవాడు లోకువ. మనింటికొచ్చిన వాళ్ళని కష్టపెట్టడం దేనికని వాళ్ళేం చెప్పినా నమ్మినట్టు తలూపుతూ తగ్గట్టుగా నటిస్తాం. దాంతో వాళ్ళకి ఉత్సాహం వచ్చేస్తుంది. మన చెవుల్లో వాళ్ళకి మూడు పూలు, ఆరు కాయలు కనిపిస్తాయి. రెచ్చిపోయి రకరకాల కథలు చెప్తారు. ఆ మధ్యన ఆ బాపతు శాల్తీ ఒకటి మా ఇంటి కొచ్చింది. వారికి ఆరోగ్యం సరిగా వుండడం లేదని అంతకుమునుపే విని వుండడం చేత మర్యాదకి ఎలా వుంది ఆరోగ్యం అనడిగా ఇహ మొదలైంది కథాకేళీ, మొన్న వీరి ఆరోగ్య పరామర్శకి వీళ్ళింటికి సాక్షాత్తు మహా విష్ణువుల వారొచ్చేరట. ఈయన తలుపు తీసి స్వామివార్ని గుర్తుపట్టలేకపోయారుట. ఎంచేతనంటే స్వామి కిరీటం, శంఖు చక్రాలు , నగలు అన్నీ వైకుంఠంలో వదిలేసి దాచేసి మామూలుగా మఫ్టీలో వచ్చేరట. ఇదేమిటి స్వామి ఇంత నిరాడంబరంగా వచ్చేరంటే ఆయన చిద్విలాసంగా నవ్వి ' వచ్చింది భూలోకానికి , పైగా రాజధానికి. అంచేత కట్టుబట్టలతో వచ్చే ' నన్నాట. స్వామివార్ని లోనికి సాదరంగా ఆహ్వానించి , భార్యని పిలిచి మహా విష్ణువుల వారొచ్చేరు. నమస్కారం చేసుకుని పళ్ళు, పాలు సిద్ధం చేయమంటే ఆవిడి మొగుడ్ని పట్టుకుని ఘొల్లుమని డాక్టరు దగ్గరకి పోదాం పదండి అందట. ఆయనకు పెళ్ళాం ధోరణి అర్థం కాక తెల్లబోయి ' ఇదేమిటి స్వామీ నిన్ను చూడలేకపోతోంది ' అంటే ఆయన మళ్ళీ ' నీకు తప్ప నేనెవరికీ కనిపించను భక్తా. అంచేత ఆవిడ తప్పు కాదు ' అన్నాట్ట . వీడికి ఒళ్ళు పులకించిపోయిందట. గది తలుపులు మూసేక ఏవిటి విశేషాలు అంటూ విష్ణుమూర్తులవారు వీరిని అడిగిన మీదట, కర్ఫ్యూల గురించి , కత్తి పోట్ల గురించి , మండలాలు , మసీదులు వివాదం గురించి విపులంగా చెప్పేట్ట. అంతా విని దేవుడు దీనంగా మొహం పెట్టి ఏవిటి ఈ మనుషులు ఇలా అయిపోయారని అడిగితే వీడి కంగారు వదనంతో స్వామిలో మునుపటి ఉత్సాహం కాస్త తగ్గినట్టుగా అనిపించిందట. స్వామివార్ని ఉత్సాహ పరచడానికి ఆటోని టాంక్ బండ్ దగ్గర ఆపించి, అక్కడున్న విగ్రహాల్ని చూపిస్తూ వీళ్ళంతా మాలో గొప్పవాళ్ళు . మానవజాతి నాగరికతని , సంస్కృతిని, కళల్ని , అభివృద్ధి పరచి చరిత్రకెక్కిన ప్రసిద్ధులు ' అంటూ గుండెలు గర్వంతో ఉప్పొంగిపోయేలా చెప్తుంటే , స్వామివారి కటువుగా ' నిన్న కాక మొన్న

అమాయకులైన ప్రజల్ని పొడిచి చంపింది మీ మనుషులేగా ! శుభం అశుభం తెలీని పసికూనల్ని ధారుణంగా చంపింది మీరేగా ? అడవాళ్ళని అమానుషంగా యాసిడ్‌తో హింసించిందీ మీ మనుషులేగా ! వీడు కంగారుగా నాకేం తెలీదు. వొట్టు అన్నాట్ట. సరే అలా వెళ్ళి దేశం చూసొద్దాం పదమంటూ గది తలుపులు తీసేసరికి గుమ్మంలో భార్య పక్క వీధి డాక్టరురుగారితో రెడీగా వుందిట. డాక్టరుగారు వీర్ని చూడంగానే ఏవిటి ట్రబులని అడిగేరట. స్వామివారొచ్చేరు నమస్కారం చేసుకోండి, నాకేం ట్రబుల్లేదని చాలా ధైర్యంగా చెప్పాడట. ఆ డాక్టరు గారు మీకీ దైవదర్శనాలు ఎన్నాళ్ళుగా జరుగుతున్నాయి అనడిగారట. ఇవ్వాళే ప్రధమం అనంగానే ఆయన పెద్ద ఫోజుగా ఆలస్యం జరుగుంటే కొంపలంటుకుపోయేవి, మీ మాంగల్యం చాలా గట్టిది వగైరా అంటూ ఇంజక్షన్ చేస్తా, క్యాప్సూల్సు రాసిస్తా, జాగ్రత్తగా వాడాలి సుమా అంటూ సంచీ తెరుస్తుండగా , ఈయన స్వామితో ఇదెక్కడి గోల స్వామీ రక్షించు అన్నాట్ట. అంతల్లో డాక్టరుగారే సారీ సిరెంజి మర్చిపోయా క్లినిక్కు రండి అనుకుంటూ వెళ్ళిపోయేట్ట. స్వామి చూశావా మరి అన్నట్టు నవ్వేట్ట. ఇద్దరు కలిసి బయటికొచ్చేరట. ఆటోని పిలిచి ఎక్కండి స్వామీ అన్నాట్ట. స్వామి ఎక్కేట్ట. ఆటో డ్రయివరు మాత్రం అర్ధం కాక వెర్రి మొహం పెట్టేట్ట. ఈయన సొంతంగా మాట్లాడుకుంటున్నాడేమిటి చెప్మాని. ఆటో స్పీడందుకుని ఎక్కుపెట్టి వొదిలిని బాణంలాగా దూసుకుపోతుంటే స్వామివారు కంగారుపడి కాస్త నెమ్మదిగా వెళ్ళమని చెప్పుభక్తా అన్నట్ట. వీడు అవమానంతో తల దించుకుని ‘ సారీ స్వామీ వీళ్ళు ఎవరు చెప్పినా వినరు – ఆఖరికి నువ్వు దర్శనం ఇచ్చి చెప్పినా ఉపయోగం సున్నా ’ అన్నాట్ట. అంతలో ఆటో చిన్న సైజు గోతిలో పడి, రెండడుగులు పైకి లేచి , దభీమంటూ నేలని తాకి అదే స్పీడుతో వెళుతుంటే , వీడు స్వామివారికి ధైర్యం చెబుతున్నట్టుగా ఇక్కడి రోడ్లు ఇంతే ప్వామి , నువు అదృష్టవంతుడివి, వర్షం గాని పడుంటే కథ వేరేగా వుండేది అన్నాట్ట. ఇదంతా విన్నాక స్వామివారు ఇవేనా మీ నాగరికత , సంస్కృతీన్నూ ’ అన్నాట్ట ఆవేశంగా . అలా అంటున్నప్పుడు దేవుడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయిట. ఇదంతా నే చూడలేను, వెడుతున్నా భక్తా అన్నాట్ట. మళ్ళీ ఎప్పుడొస్తావు స్వామీ అనడిగితే బదులు చెప్పకుండానే వెళ్ళిపోయేట్ట. ఇదంతా నిజంగా జరిగిందే ఒట్టు అంటున్నారు –అహ మీరు నమ్ముతారా ?

-------- **అయ్యిపోయింది** --------